క్లుప్తంగా

రానున్న మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలి

సంతనూతలపాడు: మండలంలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో వర్షాలు కురిసి పిడుగులు పడే అవకాశం ఉన్నందున కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో డి.సురేష్ బాబు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు ఫ్లెక్సీలు వేయించి ప్రతి సచివాలయంలో ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అందుబాటులో ఉన్న చర్చిలు, దేవాలయాలు, మసీదుల మైకులను ఉపయోగించుకుని పిడుగుపాటుపై ప్రచారం చేసి ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, జాగ్రత్తలు పాటించేలా చూడాలని చెప్పారు.

గ్రీవెన్స్‌సెల్‌కు ఐదు అర్జీలు

మద్దిపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు ఐదు అర్జీలు అందినట్లు తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. సర్వే విషయమై మూడు అర్జీలు రాగా, మరో రెండు అర్జీలు 22ఏపై వచ్చినట్లు ఆయన వెల్లడించారు. అర్జీలను వారం రోజుల్లోగా పరిష్కరించే ప్రయత్నం చేస్తానన్నారు.

పదో తరగతి విద్యార్థులకు సత్కారం


విద్యార్థినులను సత్కరిస్తున్న అవిశనేని వెంగన్న

చీమకుర్తి: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను కాపు సంఘం ఆధ్వర్యంలో సోమవారం శాలువాలు కప్పి బహుమతులు అందించి ఘనంగా సత్కరించారు. చీమకుర్తిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అవిశనేని వెంగన్న మాట్లాడుతూ పదో తరగతిలో రొతు తేజో వర్షిత 597 మార్కులు, ఉత్కళం లక్ష్మీ మేఘన 580 మార్కులు సాధించడం అభినందనీయమని తెలిపారు. రానున్న రోజుల్లో వారు మంచి ప్రతిభతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పత్తి కోటయ్య, ఉల్లి సుబ్బారావు, రొతు సుబ్బారావు, స్థానికులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు సిటీ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లకు గత సంవత్సరం మే నెల జీతాన్ని మంజూరు చేయాలని విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌కు కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ రాష్ట్ర చైర్మన్ కుమ్మరకుంట సురేష్, కో చైర్మన్ కల్లూరు శ్రీనివాస్ సోమవారం ఉండవల్లిలో జరిగిన ప్రజాదర్బార్‌లో కలిసి వినతిపత్రం అందించారు. రానున్న విద్యా సంవత్సరానికి కొనసాగింపు ఉత్తర్వులు కూడా మే నెల నుంచే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

మాట తప్పని నాయకుడు.. వైఎస్ జగన్

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, పక్కన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, చుండూరు రవిబాబు, తదితరులు

ఒంగోలు సిటీ: ప్రజల కోసం నేను ఏదైతే చెప్తానో అదే చేస్తా.. ఏదైతే చేస్తానో అదే చెప్తా... ఒకటి చెప్పి మరొకటి చేయను అంటూ మాటతప్పని, మడమ తిప్పని నాయకుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు కొనియాడారు. ఆదివారం రాత్రి ఒంగోలు రూరల్ పరిధిలోని చేజర్ల గ్రామంలో జరిగిన చేజర్లమ్మవారి తిరునాళ్ల మహోత్సవంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన ప్రభపై ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబుతో కలిసి హాజరైన సందర్భంగా కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ యువకుడు, ఉత్సాహవంతుడు చుండూరు రవిబాబుకు మంచిగా తోడుగా ఉండి జగనన్నకు అండగా నిలబడి ఫ్యాన్‌ను గిరాగిరా తిప్పాలని పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలకు పిలుపునిచ్చారు. జగన్ మంచి మనిషి, మనసున్న మనిషి అని, చంద్రబాబులా అబద్ధాలు చెప్పే మనిషి కాదని అన్నారు. ఎలక్షన్‌కు ముందు హామీలకు సంబంధించి అబద్ధాలు చెప్పమని జగనన్నతో అంటే.. నేను చెప్పను.. ఓడిపోయినా పర్వాలేదని అన్నారని గుర్తుచేసుకున్నారు. నాయకులు, కార్యకర్తలను 2.0లో ఎలా చూసుకుంటారో జగనన్న చెప్పారన్నారు. రాజకీయం, అభివృద్ధి, సంక్షేమం అమలు చేసి కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాడని తెలిపారు. రాబోయే రోజుల్లో 2.0 పరిపాలన ఉంటుందన్నారు. గతంలో ప్రతిపక్షం మూడు సంవత్సరాల వరకు కనబడలేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మూడు నెలలకే ప్రజల్లో వ్యతిరేకత వస్తోందని అన్నారు. పార్టీలు, కుల మతాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలు అందరికీ ఇవ్వడమే మేము చేసిన తప్పా అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని జగనన్న అన్ని రకాలుగా అభివృద్ధి చేసి జీడీపీలో, కొనుగోలు శక్తిలో దేశంలోనే మన రాష్ట్రం నంబర్‌వన్ స్థానంలో ఉండేలా చేశారన్నారు. చంద్రబాబు పుణ్యమా అని మూడున్నర లెస్‌లోకి వెళ్లామన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా చెల్లించక పోవడంతో చాలా మంది విద్యార్థులు సర్టిఫికెట్లు తెచ్చుకోలేక, ఉపాధి అవకాశాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. చంద్రబాబు దుర్మార్గుడని, సంపద సృష్టిస్తానంటే ప్రజలు నమ్మి మోసపోయారని అన్నారు. ఒక వ్యక్తి ప్రశ్నిస్తా అని చెప్పి ప్రజలకు నిరాశ మిగిల్చారంటూ పవన్ కళ్యాణ్‌ను ఎద్దేవా చేశారు.

రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేసిన చంద్రబాబు : చుండూరి రవిబాబు

రైతుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా చంద్రబాబు గాలికొదిలేశారని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో పొగాకు, ధాన్యానికి, మిర్చి, మినుము, కందులకు ధరలు లేవన్నారు. ఈ ప్రభుత్వంలో కరువు, అధిక వర్షాలతో పంటలు దెబ్బతింటున్నాయన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రైతులకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుందన్న విషయం మనందరికీ తెలుసని అన్నారు. రైతులను గాలికొదిలేసిన చంద్రబాబు.. వేల కోట్లు పెట్టి వర్కులు చేసుకుంటూ కమీషన్లు ఆశిస్తున్నారని విమర్శించారు. జగనన్న నిజాయితీపరుడని, చెప్పిన ప్రతి పనీ చేశారని వివరించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు తన హయాంలో ఎంతో చేయూత అందించారన్నారు. చంద్రబాబు దుష్ట పరిపాలనను అంతమొందించి జగనన్నను మళ్లీ సీఎం చేసుకునేందుకు వైఎస్సార్ సీపీని బలపరచాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, కొత్తపట్నం మండల అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి, ఒంగోలు రూరల్ మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాలడుగు రాజీవ్, జి.నారపురెడ్డి, పల్లప్రోలు సుబ్బారెడ్డి, పల్లప్రోలు వేణుగోపాలరెడ్డి, దాసరి కరుణాకర్, రాయపాటి అంకయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దమ్ము, ధైర్యం, సత్తా ఉన్న ఏకైక నాయకుడు జగనన్న : బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన దమ్ము, ధైర్యం, సత్తా ఉన్న ఏకైక నాయకుడు జగనన్న అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. కరోనా వంటి విపత్తుల సమయంలో కూడా ఇచ్చిన హామీలను కులమతాలకు అతీతంగా అన్నివర్గాల వారికి అందజేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ఏడాదవుతున్నా అమలు చేయకుండా నిట్టనిలువునా మోసం చేశారని విమర్శించారు. నా దగ్గర డబ్బులు లేవని చంద్రబాబు అనడం, సంపద సృష్టించాలనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే నాయకుడు మా జగనన్న అని కొనియాడారు. గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలంతా సమిష్టిగా కష్టపడి పని చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2029లో ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న చుండూరి రవిబాబు

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు

ఒంగోలు సిటీ: నగరంలోని వైఎస్సార్ సీపీ నాయకులంతా పార్టీ బలోపేతానికి సమిష్టిగా పనిచేయాలని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు పిలుపునిచ్చారు. ఒంగోలు నగరంలోని 4వ డివిజన్‌లో సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చుండూరు రవిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా.. సంక్షేమ పథకాల అమలులో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. కేవలం చంద్రబాబు కల్లబొల్లి కబుర్లతో కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు మొహమ్మద్ చాన్ బాషా, కాలేషా, శ్యాంసాగర్, గుడ్డల వెంకటేశ్వర్లు, ఉన్నం జనార్దన్, భూమిరెడ్డి రవణమ్మ, అప్సర్, మేరీ, ప్రసన్న, వాణి, నాగూర్, మూసా, అబ్దుల్ ఖుద్దూస్, ఇదయాతుల్లా, సలాం, అమర్, జాఫ్రుళ్ల, దాసరి కరుణాకర్, పులుసు సురేష్‌బాబు, మలిశెట్టి దేవ, రియాజ్, రఫీ, షేక్ జబీ, షేక్ సాదిక్, షేక్ రజాక్, షేక్ కరీముల్లా, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మంగారి ఆరాధన


మంగమూరుడొంక అచలానంద ఆశ్రమంలో స్వామివారి పూజలో పాల్గొన్న పరిపూర్ణ సిద్ధానందస్వామి, భక్తులు


మంగమూరుడొంక అచలానంద ఆశ్రమంలో కోలాట నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

ఒంగోలు మెట్రో: స్థానిక రంగారాయుడు చెరువు వద్ద గల గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో, కర్నూలు రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో, శ్రీరామ్ కాలనీలోని బ్రహ్మంగారి మందిరంలో, మంగమూరు డొంక అచలానంద ఆశ్రమంలో బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు సోమవారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి అభిషేక కైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గర్భాలయంలో స్వామి, అమ్మవార్ల మూలవిరాట్లకు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల పండ్ల రసాలు, పరిమళ ద్రవ్యాలతో నేత్రోత్సవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేసి మహా మంగళహారతులు అందజేశారు. భక్తులు విశేషంగా పాల్గొని అభిషేక జలాలను ప్రోక్షణ చేయించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు, పాలక మండలి సభ్యులు, వేద పండితులు, అధిక సంఖ్యలో భక్తజనం పాల్గొన్నారు.

నేటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు

నాగులుప్పలపాడు: స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు 61వ వార్షిక ఆరాధన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిరోజూ స్వామివారికి విశేష పూజలు, వాహన ఉత్సవాలు, కోలాటం జరుగుతాయని తెలిపారు.

కుట్టుమిషన్ల స్కీం.. అంతా స్కాం

- కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు ఆగ్రహం



మాట్లాడుతున్న బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు

ఒంగోలు సిటీ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల తర్వాత మంచి ప్రభుత్వం అని ప్రకటించారని, కానీ, ఇది ముంచే ప్రభుత్వమని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు విమర్శించారు. ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బీసీ సెల్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదకొండు నెలల పాలనా కాలంలో కూటమి ప్రభుత్వం అన్ని విషయాల్లో ఘోరంగా విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వంలో పథకాలన్నీ నిలిచిపోయి స్కాములమయంగా మారిందని విమర్శించారు. బీసీలకు కుట్టుమిషన్ల పంపిణీ, ట్రెనింగ్ అనే పథకం ద్వారా లక్ష మంది బీసీ లబ్ధిదారులను గుర్తించి ఒక్కొక్కరికీ రూ.23 వేలు అందిస్తున్నామంటూ రూ.230 కోట్లు కేటాయించి ఒక రిటైర్డు ఐఏఎస్ అధికారిచే ఆఘమేఘాలమీద అమలు చేశారన్నారు. ఈ పథకంలో అంతా స్కామేనని అన్నారు. రూ.4,300 ఖరీదు చేసే నాసిరకం కుట్టుమిషన్ అందించి ఒక్కొక్కరి ట్రెనింగ్‌కు రూ.3 వేలు మాత్రమే ఇచ్చారన్నారు. ఒక బీసీ లబ్ధిదారునికి కుట్టుమిషన్, శిక్షణకు అయ్యే ఖర్చు రూ.7,300 మాత్రమే అన్నారు. ఒక లబ్ధిదారుడికి రూ.23 వేలు చెందాల్సి ఉండగా, కేవలం రూ.7,300 మాత్రమే ఇచ్చారని, మిగిలిన రూ.16,700 దోపిడీ చేశారని అన్నారు. ఈ విధంగా మొత్తం రూ.167 కోట్ల స్కాం జరుగుతోందన్నారు. అలాగే, కమ్మ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్, ఆర్య వైశ్య కార్పొరేషన్, క్షత్రియ కార్పొరేషన్, ఈబీసీలకు ఐదు కార్పొరేషన్లు కలిపి మరో 50 వేల కుట్టుమిషన్లకు టెండర్లు సిద్ధం చేస్తున్నారని అన్నారు. ఒక్కొక్క కార్పొరేషన్‌కు పదివేల కుట్టుమిషన్ల చొప్పున 115 కోట్ల టెండర్లు పిలువనున్నారని, ఆ ప్రకారం మరో 81.5 కోట్ల స్కాంకు సిద్ధమవుతున్నారంటే.. మొత్తం రూ.244.50 కోట్ల స్కాం చేస్తున్నారని బొట్ల సుబ్బారావు ఆరోపించారు. లబ్ధిదారులకు దారాలు, కత్తెర, స్కేల్, ట్రెనింగ్‌కు ఒక ట్రెనింగ్ కిట్‌ను కాంట్రాక్టర్ ఇవ్వాలని, కానీ, అవన్నీ లబ్ధిదారులే తెచ్చుకుంటున్నారని, ఇదొక మోసమని అన్నారు. ఇవన్నీ కూడా బీసీ మహిళలకు కూటమి ప్రభుత్వం శఠగోపం పెట్టే విధంగా ఉన్నాయన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. యువగళం పాదయాత్రలో బీసీలకు రక్షణచట్టం ఏర్పాటు చేస్తామని నారా లోకేష్ చెప్పారని, పదకొండు నెలలైనా పట్టించుకోలేదని విమర్శించారు. 50 సంవత్సరాలు నిండిన బీసీలందరికీ పింఛన్ ఇస్తామని చెప్పారని, కానీ ఇంతవరకు ఆ ఊసే లేదని, పైగా, ఉన్న పింఛన్లు కత్తిరిస్తున్నారని మండిపడ్డారు. డిప్యూటీ సీఎం అన్నీ వేషాలు మార్చి ఇప్పుడు సనాతన ధర్మం అంటున్నారని విమర్శించారు. విలేకరుల సమావేశంలో కార్పొరేషన్ మాజీ డైరెక్టరు జి.రజనీ, బీసీ నాయకులు కుట్టుబోయిన కోటియాదవ్, పిగిలి శ్రీనివాసరావు, ఫణిదపు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా పాదుకలను దర్శించుకున్న భక్తులు

చీమకుర్తి: షిరిడీ నుంచి తీసుకొచ్చిన సాయిబాబా పాదుకలను స్థానిక భక్తులు సోమవారం దర్శనం చేసుకున్నారు. చీమకుర్తిలోని షిరిడీ సాయిబాబా మందిరం వద్ద షిరిడీ నుంచి తీసుకొచ్చిన పాదుకలను భక్తుల దర్శనార్థం ఉంచారు. వాటిని ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ వీవీ శివారెడ్డి దంపతులు సాయిబాబా విగ్రహం వద్ద ఉంచారు. అనంతరం శివారెడ్డి తన తలపై పెట్టుకుని ఊరేగింపుగా తీసుకొచ్చారు. షిరిడీ వెళ్లలేని భక్తులకు పాదుకలను దర్శించుకునే భాగ్యం కల్పించే నిమిత్తం తీసుకొచ్చినట్లు మహల్సాపతి ముని మనుమడు శ్రీకాంత్ మహల్సాపతి తెలిపారు. స్థానిక భక్తులు షిరిడీ మందిరంలోని పాదుకలను దర్శించుకుని స్వామివారి ఆశీసులు అందుకున్నారు.


షిరిడీ నుంచి తీసుకొచ్చిన సాయిబాబా పాదుకలు


సాయిబాబా పాదుకలను తీసుకొస్తున్న శివారెడ్డి

మట్టి నమూనా పరీక్షలపై అవగాహన అవసరం

నాగులుప్పలపాడు: రైతులకు భూమి స్థితి, రసాయనిక ఎరువుల వినియోగం గురించి తెలియజేయడానికి ప్రతిఒక్కరూ మట్టి నమూనా సేకరణ, పరీక్షలపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి వెంకట్రావు సూచించారు. మట్టి నమూనా విధానంపై సోమవారం మండల కేంద్రంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి మట్టి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. మట్టి పరీక్షల ఫలితాల ద్వారా భూమిలో సేంద్రియ కర్బనం, స్థూల పోషకాలు, సూక్ష్మ పోషకాలతో పాటు చౌడు లక్షణాల గురించి, లవణ సూచిక గురించి తెలుస్తుందన్నారు. మట్టి పరీక్షల ఆధారంగా రసాయనిక ఎరువులు వాడుకోవాలని, అధిక మోతాదులో రసాయనిక ఎరువులు వాడకూడదని తెలిపారు. రాబోయే కాలంలో ప్రభుత్వం సూక్ష్మపోషకాల లోపమున్న పొలాల రైతులకు పూర్తి ఉచితంగా సూక్ష్మపోషకాలు అందజేయనున్నట్లు తెలిపారు. 2025-26 ఏడాదికిగానూ మండలానికి 1100 శాంపిల్స్ టార్గెట్‌గా ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


మట్టి నమూనా పరీక్షల గురించి వివరిస్తున్న ఏవో వెంకట్రావు

భక్తిశ్రద్ధలతో అభిషేక జల కలశ శోభాయాత్ర


అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులతో సారె సమర్పిస్తున్న మహిళా భక్తులు


అమ్మవారి అభిషేకానికి 108 కలశాలతో జలం తరలిస్తున్న మహిళా భక్తులు


సంతనూతలపాడు: పూజలందుకుంటున్న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

- 108 రకాల దివ్య పరిమళ పుష్ప ఫల ప్రసాదాలతో సారె సమర్పణ
- వైభవంగా వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి మహోత్సవాలు

ఒంగోలు మెట్రో: వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం ఒంగోలు నగరంలో అధిక సంఖ్యలో హిందూ మహిళలు సామూహికంగా 108 కలశాలతో స్థానిక రంగారాయుడు చెరువు వద్ద నుంచి మంచినీటి తీర్థ జలంతో శోభాయాత్ర నిర్వహించారు. ఒంగోలు గాంధీరోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం అర్చకస్వామి ఆ జలంతో అమ్మవారి మూల విరాట్‌కు అభిషేకం చేశారు. ఉభయదాతలచే అర్చకులు పూజా క్రతువులు జరిపించారు. అనంతరం దేవస్థానం నుంచి హిందూ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని 108 కలశాలను సిద్ధం చేసి అమ్మవారి నామస్మరణతో కలశాలను తలపై పెట్టుకుని గాంధీరోడ్డు, దక్షిణం బజారు, ఏనుగుచెట్టువీధి, పప్పు బజారు, బంగారు షాపుల సముదాయాలు, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల మీదుగా శోభాయమానంగా మంగళ వాయిద్యాల నడుమ రంగారాయుని చెరువు వద్దకు చేరుకున్నారు. గంగా మాతకు పూజ చేసి అభిషేక జలం సేకరించి తిరిగి ఆలయానికి చేరుకున్నారు. పువ్వాడ శ్రీమన్నారాయణ దేవస్థానంలో వాసవీ పతాకం ఎగురవేసి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మహిళలు ఒక్కొక్కరిగా అభిషేక జలాన్ని అర్చకులకు అందించి అమ్మవారి అభిషేకంలో పాల్గొన్నారు. శోభాయాత్రలో పాల్గొన్న భక్తులందరికీ వాసవీ క్లబ్ సభ్యులు మజ్జిగ పంపిణీ చేశారు. సాయంత్రం ఆరు గంటలకు వాసవీ కోలాట భజన మండలి సభ్యులు, పెద్ద సంఖ్యలో మహిళలు గాంధీరోడ్డులోని కోదండ రామస్వామి దేవస్థానం వద్ద నుంచి 108 రకాల దివ్య పరిమళ పుష్ప ఫల ప్రసాదాలతో ఊరేగింపుగా విచ్చేసి వాసవీ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పసుపు కుంకుమ గాజులతో సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పెనుగొండ నుంచి చెన్నై బయలుదేరిన వాసవీ జ్యోతి ఆలయానికి రాగా, భక్తులు నీరాజనాలు సమర్పించారు. వాసవీ కోలాట భజన మండలి వారిచే కోలాట నర్తనం, గుడి ఉత్సవం, తీర్థ ప్రసాద వినిమయం జరిగింది.

వాసవీ మాత జయంతి మహోత్సవాలు ప్రారంభం

సంతనూతలపాడు: సంతనూతలపాడులోని ఆర్య వైశ్య కళ్యాణ మండపం ప్రాంగణంలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆర్యవైశ్య కళ్యాణ మండపం కమిటీ ఆధ్వర్యంలో మొదటిరోజు కలశస్థాపన, గణపతి పూజ, అభిషేకాలను అర్చకుడు జి.శివరామకృష్ణ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి గీతా పారాయణం, తదితర ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపం అధ్యక్షుడు వేమా మల్లేశ్వరరావు, సెక్రటరీ పబ్బిశెట్టి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు శిఖాకొల్లి సత్యనారాయణ, కోశాధికారి వేమా చిన వెంకట కృష్ణారావు, కమిటీ సభ్యులు పాల్గొని పర్యవేక్షించారు.

పరస్పరం సహకారంతో సేవలు వేగవంతం

- 7వ అదనపు జిల్లా జడ్జి టి.రాజావెంకటాద్రి



మాట్లాడుతున్న 7వ అదనపు జిల్లా జడ్జి టి.రాజావెంకటాద్రి

ఒంగోలు: పరస్పర సహకారంతో కక్షిదారులకు మెరుగైన సేవలు అందిద్దామని 7వ అదనపు జిల్లా జడ్జి టి.రాజావెంకటాద్రి పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక జిల్లా కోర్టు భవనాల సముదాయం ఆవరణలో నిర్వహించిన ఒంగోలు బార్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒంగోలు బార్ అసోసియేషన్ నుంచి మంచి సహకారం లభిస్తుందని, నూతన కార్యవర్గం కూడా ఆ ఒరవడిని మరింతగా పెంచాలని అన్నారు. తమ వైపు నుంచి కూడా బార్‌కు మంచి సహకారం ఉంటుందని, అందరం కలిసి సేవలను వేగవంతం చేద్దామని అన్నారు. ఈ సందర్భంగా పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు వారి అభిప్రాయాలు తెలియజేసి సలహాలు అందించారు. నూతన కార్యవర్గ సభ్యులు తమను తాము పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో 1వ అదనపు జిల్లా జడ్జి టి.రాజ్యలక్ష్మి, 2వ అదనపు జిల్లా జడ్జి పందిరి లలిత, 3వ అదనపు జిల్లా జడ్జి ఎ.పూర్ణిమ, ఫ్యామిలీ కోర్టు జడ్జి జి.దీన, అదనపు సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్‌వీ రామకృష్ణ, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్, ఇతర జూనియర్ సివిల్ జడ్జిలు, ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, ఇతర పాలకవర్గ సభ్యులు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఆరోగ్యంపై ప్రత్యేక శిక్షణ


సచివాలయ సిబ్బందికి ఆరోగ్యంపై సూచనలు చేస్తున్న డాక్టర్ వినయ్

సంతనూతలపాడు: జిల్లా పరిషత్ సీఈవో సూచనల మేరకు నిజాం ఫిజియోథెరపీ ఇన్‌స్టిట్యూషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో సచివాలయాల సిబ్బంది, కార్యదర్శులకు ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క ఉద్యోగి శారీరక వ్యాయామంతో పాటు ఆహారపు అలవాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ వినయ్ అవగాహన కల్పించారు. శారీరక బలహీనతలు ఉన్నప్పుడు ఫిజియోథెరపీ చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని ఎంపీడీవో సురేష్‌బాబు కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎం.రమణమ్మ, నిజాం ఫిజియోథెరపీ ఇన్‌స్టిట్యూషన్ వైద్య ప్రతినిధులు, మండలంలోని సచివాలయాల సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలి


నాగేశ్వరరావు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఒంగోలు టౌన్: పిడుగుపాటుకు గురై మరణించిన గొర్రెల కాపరుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘ రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయ్ డిమాండ్ చేశారు. పిడుగుపాటుకు గురై మరణించిన నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి గ్రామానికి చెందిన దివ్యాంగుడైన గొర్రెల కాపరి కొండపి నాగేశ్వరరావు మృతదేహాన్ని సోమవారం ఒంగోలు జీజీహెచ్‌లో ఆయన సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఒక్కరోజే ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో ముగ్గురు గొర్రెల కాపరులు పిడుగుపాటుకు మరణించడం బాధాకరమన్నారు. నాగులుప్పలపాడు మండలంలోని ఈదుమూడిలో నాగేశ్వరరావుతో పాటు ఒంగోలు మండలంలోని దేవరంపాడు గ్రామానికి చెందిన వద్దమూడి శిరీష, బాపట్ల జిల్లా చినగంజాం మండలం సోపిరాల గ్రామంలో పశువుల కాపరి గడ్డం బ్రహ్మయ్య పిడుగులు పడి మరణించారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారాన్ని అందించి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వృత్తి సంఘాల నాయకుడు పూసపాటి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం


దుప్పట్లు పంపిణీ చేస్తున్న మారం వెంకారెడ్డి, డాక్టర్ జవహర్

చీమకుర్తి: ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి తన తల్లిదండ్రుల పేరు మీద నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీ జవహర్ అన్నారు. మారం వెంకారెడ్డి తల్లి మారం చిన్నమ్మ వర్ధంతి సందర్భంగా మారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం వెయ్యి మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జవహర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా వెంకారెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయన్నారు. వెంకారెడ్డి మాట్లాడుతూ తన తల్లిదండ్రుల పేరు మీద పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతృప్తిగా ఉందన్నారు. తొలుత మారం చిన్నమ్మ చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వెయ్యి మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోపిరెడ్డి సుధీర్‌రెడ్డి, మారం వెంకట సుబ్బారెడ్డి, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, కోటా రాములు, బడే దశరథరామిరెడ్డి, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, పేరం శ్రీనివాసరావు, చింతకింది అశోక్, కడవా రామకృష్ణ, పోకూరి రామకృష్ణారెడ్డి, అంబటి వీరారెడ్డి, బండ్ల కొండలు, బక్కా రత్నం, స్థానికులు పాల్గొన్నారు.